ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-3, (July-Sept), 2025

# దశాబ్ద కాలం (2001-2010) నాటి విప్లవకవిత్వం- కార్మిక, ముస్లిం స్త్రీల ఆత్మగౌరవ పోరాటం

వాసుపల్లి రామారావు
యు.జి.సి. పరిశోధక విద్యార్థి
తెలుగుశాఖ, ఆంధ్ర విశ్వవిద్యాలయం
చరవాణి:9705563969

Article Received: 26/08/2025;Article Accepted: 24/09/2025;Published Online: 26/09/2025
DOI:10.53414/Sahithyatharangini.2025.23104

**వ్యాససంగ్రహం:** సమాజాన్నీ, సాహిత్యాన్నీ విడదీసి చూడలేము. దీనికి తగినట్లే ప్రాచీన కవిత్వం ఆనాటి కవుల, రాజుల, ప్రోత్సాహకుల భావజాలాలను అనుసరించింది. ఆధునిక కాలంలో సమాజాన్నే కవిత్వం ప్రతిబింబించడాన్ని అలవర్చుకుంది. ఆధునిక సాహిత్యానికి మత, రాజకీయ, సాంఘిక పరిస్థితులు అనేవి క్రియాశీలక ప్రభావాలను జతచేసాయి. దీంతో సమాజానికి అవసరమైన సమస్యా చర్చతో కూడిన, చైతన్య సంబంధిత సాహిత్యం నవ్యకాలంలో పరవళ్ళు తొక్కింది. ఇందులో సంఘసంస్కరణ, జాతీయోద్యమ, అభ్యుదయం, విప్లవం వంటివి సమాజగతుల నుండి పుట్టాయి. అలా సామాజిక ప్రయోజనాన్ని ఆశించే దిశలో సాహిత్యం కొత్త ఊపిరిని పొందింది. ఓ మూసపోసిన సమాజంలో కొన్ని అన్యాయాలు, కొందరికి నష్టాలు జరగడం సహజం. అక్కడ పెత్తనాలు, పెద్దరికాలు అనేవి సహజ హక్కులపై ఉక్కుపాదాన్ని మోపుతాయి. హక్కు అంటే ఏంటో తెలిసి అన్యాయాన్ని ప్రశ్నించడం ద్వారా అస్థిత్వాన్ని నిలుపుకొనే ప్రయత్నం ఉంటుంది. అది ఉద్యమించి, విప్లవించి, ప్రభవించి నిలదీయడం ద్వారా సమసమాజ స్థాపనను, అధికార వికేంద్రీకరణను, అణగద్రొక్కబడుతున్నవాని స్వరాన్ని వినిపిస్తుంది. వీటికి ఊతమిచ్చే భావనలు కవిత్వంలోనికి సమాజాన్ని అనుసరించి వచ్చి చేరాయి. ఇలా పరిశీలనా దృష్టితో చూస్తే, 2001 నుండి 2010 మధ్య కాలంలో వచ్చిన కవిత్వంలో కూడా విప్లవ కవిత్వం పురుడుపోసుకుంది. ఈ మధ్య కాలంలో వచ్చిన విప్లవ కవిత్వాన్ని అధ్యయనం చేస్తూ ముఖ్యంగా కార్మిక స్త్రీలు, ముస్లిం స్త్రీల ఆత్మగౌరవ పోరాటస్ఫూర్తి ఆయా కవిత్వాలలో ఏవిధంగా ప్రతిబింబించిందో తెలియజేసేదే ఈ వ్యాస ప్రధాన ఉద్దేశ్యం.

**ప్రధాన పదాలు:** ఆత్మగౌరవం, ఉక్కుపాదం, జమీందారీ విధానం, పెట్టుబడిదారీ విధానం, జాతీయోద్యమం, చైతన్యం, తెహల్కా, బాసిత్, తలాక్ మొదలైనవి.

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-3, (July-Sept), 2025

**ఉపోద్ఘాతం:** భూమిపై మనుషులందరి పుట్టుకా ఒక్కటే అయినా గొప్ప, అథమ అనే భేదాలపైనే సమాజం నిలబడి ఉంది. దీనివలన డబ్బులేని, నోరు లేని, అధికారం లేనివారు కులం పేరిట, లేమితనాలను నెత్తిపై రుద్దడం వలన అన్నింటినీ కోల్పోతూ అన్యాయం కాబడ్డారు. ఆ విధంగా దేనికీ తలవంచాల్సిన అవసరం లేదంటూ, అభిమానం నిలుపుకొని తలెత్తుకొని బతకాలని రచయితలు తలిచారు. ఎక్కడ దుర్మార్గం ఉందో అక్కడ నిలిచి, ఆత్మగౌరవం వారికి ఉందంటూ గళం విప్పారు. ఆ స్ఫూర్తిని అక్షరాల ద్వారా వెలువరిస్తూ వెలుగు దివిటీలను సమాజంలో పాతి, దారిని నిర్దేశించారు. కాకుంటే అడగగానే ఇచ్చే నైజం సమాజానికి లేదు. తరతరాల నుండీ లబ్ది పొందుతున్న వారిందుకు ఒప్పుకోరు. అందుకే నినదించాలి, అహింసాత్మకంగా పోరాడాలి, ఏకం కావాలి, కలిసి ఉద్యమిస్తూ ముందడుగు వేయాలి అనుకున్నారు. గౌరవాన్ని నిలుపుకొని ఉనికిని చాటడం వారి ప్రథమాచరణం. జాతీయోద్యమంలో బ్రిటిష్ వారికి ఎదురు నిలిచింది కూడా ఆత్మ గౌరవాన్ని నిలుపుకోవడం కోసమే. చరిత్రలోని అన్నిరకాల పోరాటాలకు మొదటి కారణం ఆత్మగౌరవాలను నిలబెట్టుకోవడం మాత్రమే.

సమాజంలోని ఎవరికి వారుగా జీవిస్తున్నా బలవంతుల చేతిలో బలహీనులు ఎన్నో విధాలుగా కష్టపడుతున్నారు. నష్టపోతున్నారు. సాంప్రదాయాల పేరిట, వ్యక్తుల పుట్టుకలను అనుసరించి లింగ భేదాలను బట్టి, చేసే వృత్తుల కారకంగానో, స్వార్థత్వాలవలనో, అధికారాది పెత్తనాల పైనాలో, ఆర్థిక, రాజకీయాది ఇతరత్రాలో ఒక వర్గంపై మరొక వర్గ దాష్టీకం కొనసాగుతోంది. కానీ ఎక్కడ ఒత్తిడి, అణచివేత ఉంటాయో అక్కడ ప్రశ్నించడమనేది తిరుగుబాటుకి, విప్లవానికి దారితీస్తుంది. దీంతో పీడిత వర్గం దెబ్బతిన్న తమ ఆత్మగౌరవాన్ని నిలబెట్టుకొనే యత్నంలో గర్జిస్తుంది. అలా సమకాలీన సమాజంలో జరిగిన కొందరి ఆత్మగౌరవ పోరాటాలను, ఆ స్థైర్యాలను ప్రశ్నించడాన్ని రచయితలు కవితా వస్తువులుగా ఎంచుకొని, తలెత్తుకుని బతికే హక్కు అందరికీ ఉందని అక్షరాల సాక్షిగా తెలిపారు. అటువంటి కవితల సృష్టికి సందర్భాలను, సంఘటనలను విప్లవ రచయితలు తమ భావనలకు జత చేసారు. ఇందులో భాగంగా కార్మిక స్త్రీలు, ముస్లిం స్త్రీల ఆత్మగౌరవ పోరాటాల ప్రస్తావనలు కవితలుగా తీర్చబడినవి. ఆయా కవితల్లో ఉద్యమాలు, విప్లవాలలో ఆత్మగౌరవం ఎలా భాగమైందో పరిశీలించాల్సిన అవసరం ఉంది.

**కార్మిక, కూలి స్త్రీల ఆత్మగౌరవ పోరాటం:** నేటి పేద కుటుంబాలలోని స్త్రీలు కూలి, నాలి చేసుకొని వచ్చే నాలుగు డబ్బులను కూడా ఇంటి జరుగుబాటుకి వెచ్చించుకోవాల్సిన పరిస్థితులున్నాయి. వ్యవసాయ కూలిగా, పరిశ్రమల్లో కార్మికురాలిగా, ఇంటి పనులు, రహదారిపనుల్లో శ్రామికురాలిగా ఆమె పని చేస్తోంది. అలా ఎంత చెమట చిందించినా వచ్చే డబ్బు అంతంత మాత్రమే. అది కూడా ఏదో ఒక అడ్డంకి ఏర్పడితే చేతికి అందదు.

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-3, (July-Sept), 2025

ధనవంతుల జేబులు నింపే ప్రభుత్వాల ఆసరాలు పేదల పిడికిలిని కూడా నింపవు. అయినా తన కష్టాన్ని నమ్ముకున్న కూలి స్త్రీ ఆత్మాభిమానం కలది. ఆమె కడుపుని కొట్టే పనులకు ఎవరడ్డు వచ్చినా ఆ సహనశీలి శివంగిలా ఎదురుతిరుగుతుందని 'బాసిత్ కవిత్వం లోని 'రాయిని గూడెం నల్గురు అక్కాచెల్లెండ్లు' శీర్షిక వివరించింది.

"నల్గురు అక్కా చెల్లెండ్లు నాలుగైదు వందల కూలీనాలీ అమ్మలక్కలు పాదరక్షలు, రక్షణ కవచాలు అక్కర లేకుండానే... ఇనుప బూట్ల బూటక సమైక్యాన్ని పిచ్చి ముదిరి, రొచ్చు బండ నెక్కి.. చిచ్చు బెట్టడాన్ని చీల్చి చెండాడుతారు!"

ఆడవారే కదా అని చులకన చేస్తే వారి వెనుక వేల అడుగులు వెంట నిలబడగలవని ఈ పంక్తులను గమనిస్తే తెలుస్తుంది. తనపని తాను తలవంచుకొని చేసుకెళ్ళే మహిళల విషయంలో యాజమాన్యాలు, ప్రభుత్వాలు ఏదేని నష్టం కలిగేలా చర్యలు తీసుకోవడం వెనక అన్యాయం జరిగితే ఆమె చేతులు ముడుచుకోదు. అంత వరకూ నోరు మెదపని ఆమె కొంగుదోపి విరుచుకుపడుతుంది. ఆ సమయంలో ఆవేదన, బాధ ఆవేశాన్ని రగిలించగా అందరూ ఒకటవుతారు. ఎదురుగా ఉన్నది ఎంతటి నాయకులైనా, అధికారులైనా, సాయుధ పోలీసు బలగాలైనా ఆమె లెక్కచేయదు. పాలక హస్తం పేదలకు అందించే, కోటాలను, వాటాలను రద్దు చేస్తూ ఇచ్చిన వాగ్దానాలను మరచి ఉన్నవి కూడా వెనక్కి లాక్కుంటున్నప్పుడు వారి కడుపు మండిపోతుంది. అప్పుడు రగిలే ఆకలి డొక్కలు ఎగిరిపడి ప్రశ్నిస్తారు. అలాంటి నోటిని నొక్కాలని, చూపుడు వేలుని విరవాలని ప్రభుత్వాలే తరలి రచ్చబండల వరకు వస్తాయి. కానీ చెప్పులవర్షం కురిపించే పేదల ధాటికి సాయుధులను వెంటతెచ్చుకొని నిలబడుతారు. చేత తుపాకీలతో ఉన్నా కూలీల కాలి చెప్పులక్కడ నిషిద్ధం. దీన్నిబట్టే స్త్రీలెంతలా విజృంభించగలరో, భయపెట్టి దిగివచ్చేలా కరుడుగట్టిన వారిని కదిలించగలదో తెలుస్తోంది. ఇదంతా ఆత్మగౌరవాలను నిలుపుకొంటూ మా దారికి అడ్డొస్తే సహించలేమనే హెచ్చరికలు మాత్రమేనని రచయిత రుజువు చూపారు.

గౌరవాన్ని నిలుపుకుని హక్కుల్ని పొందే దిశలో ఎప్పుడూ తలెత్తి నిలబడగలగాలి. దానికై ప్రశ్నించే స్వరాన్ని, అడుగు ముందుకేసే ధైర్యాన్ని స్త్రీలు కలిగి ఉండాలి. సమ సమాజమన్న పేరే గానీ స్త్రీ మాత్రం ఆనాటి నుండి ఈనాటికి తన హక్కులకై పోరాడుతూనే ఉంది. అలాంటిది, సాధారణ కూలీ నాలీ చేసుకునే మహిళల పట్ల వివక్షలు, పెత్తనాలు పెరుగుతున్నాయి. ఇవేవీ చాలవన్నట్లు ప్రభుత్వాలు కూడా నామమాత్రపు కంటి తుడుపులు చేపట్టే పథకాలతో ఉంది. పేద ప్రజలకు మంచి చేసేవి కూడా నిలుపుదల

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-3, (July-Sept), 2025

చేయడం, ఉక్కుపాదాల మోపడాలు చేస్తోంది. వాటి ద్వారా చిరులబ్ధినైనా పొంది తమ రెక్కలకష్టంతో కుటుంబాలను లాక్కొస్తోన్న స్త్రీల గురించి యోచించడం లేదు. ఇప్పటికే సరళీకరణల ద్వారా పరిశ్రమలు, పెట్టుబడిదారులను నెత్తిమీద పెట్టుకొన్న ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని విసిరికొట్టింది. ప్రకృతి క్షామాలు, పై వారి అలసత్వాలతో ఆసరాలేని రైతులు ఆత్మహత్యల పాలవుతున్నారు. ఆ రంగంపై ఆధారపడిన మహిళా కూలీలకు రిక్త హస్తం ఎదురవుతోంది. అలా చేతిలో పని లేక వారంతా నష్టపోతున్నారు. తమకు జరుగుతోన్న దుర్మార్గాన్ని ప్రశ్నిస్తే బలగాలతో బదులివ్వడం ప్రభుత్వానికి సరదా అయింది. కాకుంటే ఈ చులకనలతో విసుగెత్తిన స్త్రీలు తమ ఆత్మగౌరవాలను తాకట్టుపెట్టుకోలేరు. తమ ప్రాంతాలవైపు వచ్చిన నాయకులను నిలదీస్తారు. వీరిని పోలీసుల ద్వారా భయపెట్టడం, బాష్పవాయువులతో చెదరగొట్టడం వంటివి చేస్తున్నారు. దీంతో తమ ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా తప్పించుకుంటూ బెదరగొట్టే వారి పట్ల శివమెత్తారు. ఆత్మాభిమానాలను పాతర వేసే వారిని స్వాగతించమని తేల్చి చెప్పారు.

**ముస్లిం స్త్రీల ఆత్మగౌరవ పోరాటం:** లౌకిక సమాజంలో వివిధ మతాల వారు జీవిస్తున్నారు. స్త్రీ ఆత్మాభిమానాన్ని అధికంగా దెబ్బతీసే సంప్రదాయాలు ముస్లిం సంస్కృతిలో ఉన్నాయి. వాటి గురించి ఆధునిక సాహిత్యంలో విప్లవ ధోరణిలో వారి సమస్యాచర్చతో పాటు ఆత్మాభిమానాన్ని చాటుకొని వస్తువు, యంత్రము అనే భావనలున్న దగ్గర పీడింపు ఉంటుంది. ఎక్కడ పీడన ఉంటుందో అక్కడ తిరుగుబాటు తప్పదు. అలా ముస్లిం స్త్రీలపై ఆయా కుటుంబాలలో ఉండే అణచివేతపట్ల అన్యాయాలపట్ల ఎదురుతిరిగి అభిమానాన్ని నిలుపుకోమని 'స్కై బాబా' తన 'నక్కోరో బహెనా' కవిత ద్వారా పిలుపునిస్తూ నూరిపోసారు. స్త్రీవాద కవితా ధరోణి స్పష్టంగా ఉన్న సాంప్రదాయాలలోని లొసుగులను విమర్శించి అవి వారి ఆత్మాభిమానాన్ని పాతరపెడుతున్నాయని తెలపడంలో ముస్లిం కుటుంబాలలోని పురుషహంకారాలే మూలమనే వాదనని కూడా జతచేసారు. 'కవిత 2008' సంకలనంలోని ఈ కవిత అందర్నీ ఆలోచింపజేస్తోంది.

"ఉర్దూ అరబ్బీలు చదవడం ఖురాన్ పూర్తి చెయ్యడమే మీ క్వాలిఫికేషన్ అంటే ఎట్ల ఒప్పుకుందాం. కాలేజీల్లో ఎన్నెన్నో సీతాకోకచిలుకల్లో మీరొకరిద్దరే గొంగళి పురుగుల్లా... వెలేసినట్టు... చిన్నబుచ్చుకున్నట్టు... దునియా పరీక్ష కూడా పాసవ్వాలి కదరా... మిమ్మల్ని ఇళ్లకు వంటిళ్ళకు పడకిళ్ళకే పరిమితం చేసే మగ న్యాయాన్ని ఎదిరించాలిరా. మిమ్మల్నెవరూ ఇక పువ్వుల్లో పెట్టి చూడొద్దు పూల పర్దాల కింద గుచ్చుకుంటున్న ముళ్ళ పందిళ్ళని పీకేద్దాం... రండి ఇంకా మిమ్మల్ని పువ్వుల్లోనో, పిట్టలోనో

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-3, (July-Sept), 2025

పోల్చడాన్ని భరించొద్దు సౌందర్యం పేరుతో మీ రెక్కల్నెవరూ అందంగా కత్తిరించొద్దు గోషా ప్రహరీల్ని బద్దలు చేద్దాం... పదండి. "2

సామాజిక కట్టుబాట్లలో ఒక్కో మతానికి ఒక్కో విధమైన ఆచారాలుంటాయి. అవి అనాచారాలుగా మారి మహిళల స్వేచ్ఛని, ఆనందాన్ని హరించి ఆంక్షలు, నిర్బంధాలకు గురిచేసి ఆత్మాభిమానం దెబ్బతీస్తే, ఖచ్చితంగా విప్లవించమని, కనులు తెరవమని చెప్పిందీ కవిత. దీని వెనుక ఆయా స్త్రీల ఆవేదన, ఆవేశం, స్పృహని కలిగించి ఇకనైనా అస్థిత్వాన్ని నిలుపుకోమని ప్రబోధిస్తున్నాయి. నవీన కాలం స్త్రీ జీవితాలను ఉన్నత మార్గంలో నడిపిస్తున్నా కూడా ఇస్లాం మత స్త్రీల విషయంలో అవేవీ కానరావు. ఇతరుల కంటపడటమే నేరమన్నట్లు వారిని పరదాల వేసి ఘోషా పద్ధతిలో ఇంటికి పరిమితం చేస్తున్నారు. దానివలన నలుగురిలోనికి రాలేక లోకజ్ఞానాన్ని, విద్యాజ్ఞానాన్ని కోల్పోయి నిరక్షరాస్యతతో ఉండిపోతున్నారు. వివాహ వయసు రాకముందే అరబ్ షేక్లకో, పెద్ద వయస్కులకో ఇచ్చి పెళ్ళిళ్ళు చేయడం వారి బాల్యాన్ని, హక్కుల్ని హరించడమే. ఇంకా 'తలాక్' అనే ఒక్క పదంతో వారిని వదిలించుకోవడం, పిల్లల్నికనే యంత్రాలుగా చూడటం, వంటింటికే పరిమితం చేయడం వంటివన్నీ వారిని అణిచే ప్రయత్నాలుగానే చూడాలి. అలాంటి తరుణాలను గమనించిన స్త్రీవాదం, విప్లవ వాదం మైనారిటీ వాదాలు ఆయా మహిళలను కదిలిస్తూ ఆత్మగౌరవాలను నిలుపుకోమని బోధించాయి. ఎక్కడ ఎవరు అన్యాయం కాబడుతున్నా వారి వెంట సాహితీకారులుండటం సహజం. అలాంటి బాధ్యతాయుతాన్నే రచయిత చూపారు.

~~ముగింపు:~~ కవిత్వీకరించడం అంటే ఊహలను విహరింపజేయడంగా కాక మానవ సమాజంలో పీడిత వర్గాలను నిశిత పరిశీలనం చేయడంగా భావించారు. అందులో భాగంగా ఆత్మగౌరవ పోరాటాలను కవితారూపాలలో అందించారు. అలాగే లింగ, ఆర్థిక, కుల, మత, వర్గ, స్థాయీ అంతరాలు కలిగిన ఈ సమాజంలో స్త్రీ జాతి ఇంటా, బయటా సమస్యల్ని ఎదుర్కొంటూనే ఉంది. ఆనాడు, ఈనాడు అనే తేడాల లేకుండా ఎప్పటికప్పుడు ఆమె వివక్షలు, చులకన తనాల పరంగా అబల అనే ముద్రను వేయించుకుంది. దీనిపట్ల రచయితలు కలత చెంది ఆమెకు పోరాట స్ఫూర్తిని అందించారు. సమాజంలో మేమూ మనుషులమేనని గుర్తించమంటున్న కార్మిక, కర్షక, కూలీ స్త్రీలు, ముస్లిం స్త్రీల ఆత్మగౌరవ పోరాటాలను చర్చించారు. ముస్లిం స్త్రీల పరదాలు, పీడనలు పురుషాహంకారాలకు నిదర్శనం. రచయిత్రులుగా తమ భావాలను వెల్లడిచేస్తే సహించని పురుష సమాజ భావజాలాలను వివరించి సమాజంలో స్త్రీకి జరుగుతోన్న అన్యాయాలను నిరసించారు. ఇలా అస్థిత్వాన్ని నిలుపుకోడానికి పోరాటం వారివారి హక్కు గుర్తింపుగా ఆయా కవితల్లో విశదపరచడం గమనించవచ్చు.

ఈ విధంగా 2001 నుండి 2010 వరకు ఉన్న దశాబ్దకాలంలో ఆధునిక రచయితలు వెలువరించిన కవితలలో కొన్ని స్పష్ట వైఖరులు ఉన్నాయి. గత పోరాటాలలోనూ, వర్తమాన ఉద్యమాలలోనూ వారు బాధితులు, బలహీనుల వైపే నిలిచారని ముస్లిం స్త్రీలు, కార్మిక, కూలి స్త్రీలు ఆత్మగౌరవం కోసం వారి పక్షాన నిలబడిన తీరును బట్టి చెప్పవచ్చు.

**ఉపయుక్త గ్రంథ సూచిక**

*కవిత 2008*. సంపా. డా. పాపినేని శివశంకర్, సాహితీ మిత్రులు ప్రచురణ, విజయవాడ, 2009.

చలసాని ప్రసాద్. *రచనలు*. విరసం ప్రచురణలు, 2015.

నాగరాజు, పి.ఎస్. *ప్రవహించే ప్రజలు (కవిత్వం)*. మైత్రీ బుక్ హౌస్, విజయవాడ, 2005.

బాసిత్. *కవిత్వం (తెహల్కా అద్దంలో సర్కారు బింబం. మరికొంత కవిత్వం)*. విరసం ప్రచురణ, 2015.

*శివసాగర్ కవిత్వం*. సంపా. డా. గుఱ్ఱం సీతారాములు, అన్వీక్షికి పబ్లిషర్స్, హైదరాబాద్, 2019.

**వ్యాసాలు**

*ప్రగతిశీల మహిళాసంఘం (స్త్రీ విముక్తి)*. ఆంధ్రప్రదేశ్ రైతు కూలి సంఘం, ఐ.యఫ్.టియు. “**సారా వ్యాపారాన్ని రద్దు చేసే వరకు సర్కారుకు పన్నులు కట్టొద్దు!**” హైదరాబాదు, అక్టోబర్ 1992.

దేవులపల్లి అమర్. “ఆకాశంలో సగం విరిగి పడుతున్న ఈ వేళ...” *ఆంధ్రప్రభ*.